


సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM



## అమెరికాలోనే హెచ్-1బీ వీసా రెన్యువల్..!

ఉద్యోగ రీత్యా అమెరికా వెళ్లే వారికి వీసా రెన్యువల్ విషయంలో ఎదురయ్యే కష్టాలు ఇకపై తప్పనున్నాయి. హెచ్-1బీ వీసా రెన్యువల్ విధానాన్ని మరింత సరళీకరిస్తూ అమెరికా తీసుకొన్న నిర్ణయం అమల్లోకి వచ్చింది. దీంతో భారత్ సహా ఇతర దేశాలకు చెందిన వృత్తి నిపుణులు ఇకపై అమెరికాలో తమ గడువు తీరిన వీసాలను అక్కడే రెన్యువల్ చేసుకోవచ్చు.

బంగారం ధర ₹63,270 10 GRMS 24 CARAT

వెండి ధర 1KG 78,000

సెన్సెక్స్ 71,667 527

నిఫ్టీ 21,686 163

చికెన్ ధర 1KG ₹260

గుడ్ల ధరలు డజన్ ₹68

## శివసేన ఎమ్మెల్యే అనిల్ మృతి.. సీఎం షిండే దిగ్భ్రాంతి



మహారాష్ట్రలో సీనియర్ రాజకీయనాయకుడు, శివసేన ఎమ్మెల్యే అనిల్ బాబర్(74) తుదిశ్వాస విడిచారు. అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం కన్ను మూశారు. ఇక, ఆయన మృతిపట్ల సీఎం ఏక్‌నాథ్ షిండే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా, గత కొద్ది రోజులు అనిల్ బాబర్ అనారోగ్యం కారణంగా సంగ్లీ జిల్లాలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం కన్ను మూశారు. ఇక, అనిల్ మృతిపై సీఎం ఏక్‌నాథ్ షిండే దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా షిండే.. బాబర్ మృతితో ఒక మార్గదర్శిని, సన్నిహితుడిని కోల్పోయినట్టు కామెంట్స్ చేశారు. మహారాష్ట్ర ఒక సీనియర్ ప్రజాప్రతినిధిని కోల్పోయిందన్నారు. అలాగే, ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్య క్రియలు జరుగుతాయని షిండే తెలిపారు. మరోవైపు.. అనిల్ బాబర్ అకాల మరణం నేపథ్యంలో ఈరోజు జరగాల్సిన మహారాష్ట్ర కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేశారు. అనిల్ మృతి పట్ల సంతాపం తెలియజేసేందుకు ఆయన కుటుంబ సభ్యులను సీఎం షిండే పరామర్శించనున్నారు. ఈ క్రమంలో సంగ్లీలోని అనిల్ నివాసానికి షిండే వెళ్లనున్నారు. ఇక, అనిల్ బాబర్ ప్రస్తుతం సంగ్లీ నియోజకవర్గం నుంచి శివసేన ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.



## ఎమ్మెల్యేగా రేపు కేసీఆర్ ప్రమాణ స్వీకారం

బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ గురువారం గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేయనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండో రోజే కేసీఆర్ బాత్రూంలో జారి పడంతో ఆయన తుంటి విరిగిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కేసీఆర్‌కు శస్త్ర చికిత్స జరిగింది. అనంతరం డాక్టర్ల సూచన మేరకు కేసీఆర్ గత కొంతకాలంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇటీవల కర్ర సాయంతో నడవగలుగుతున్నారు. ఈ క్రమంలో అసంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సమక్షంలో రేపు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరినీ ఆహ్వానించారు. ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం నేపథ్యంలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి తరలిరానుండటంతో అసెంబ్లీ వర్గాలు భద్రతా ఏర్పాట్లపై దృష్టి సారించాయి.



## బస్సు, ట్రక్కు ఢీ.. 19 మంది మృతి

మెక్సికోలో ఘోర రోడ్డు ప్రమాద ఘటన చోటుచేసుకుంది. ఓ బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో 19 మంది మరణించారు. మరో 18 మంది గాయపడ్డారు. దీంతో, గాయపడిన వారికి వెంటనే ఆసుపత్రికి తరలించారు. వివరాల ప్రకారం.. ఉత్తర మెక్సికోలోని సినలోవాలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బస్సు, ట్రక్కు ఢీకొనడం వల్ల 19 మంది మృతి చెందగా, మరో 22 మంది గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 43 మంది ప్రయాణికులు ఉన్నారు. కాగా, పసిఫిక్ తీర రాష్ట్రం సినాలోవాలోని జాతీయ రహదారిపై సరుకులను రవాణా చేసే ట్రక్కు, బస్సు ఢీ కొనడం వల్ల ఈ ప్రమాదం జరగిందని స్థానిక అధికారులు పేర్కొన్నారు. ఇక, ఈ ప్రమాద ఘటనకు సంబంధించి సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు.



## ఆర్‌బీఐ, బ్యాంకింగ్, ఆర్థిక సంస్థల నుంచి కేంద్రానికి రూ.70,000 కోట్లు!

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), బ్యాంకింగ్, ఆర్థిక సంస్థల (ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూట్స్) ద్వారా ఏప్రిల్ నుంచి ప్రారంభమయ్యే 2024-25 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.70,000 కోట్ల డివిడెండ్‌ను పొందవచ్చని కేంద్రం భావిస్తున్నట్లు ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఈ మేరకు అంచనాలు ఉండవచ్చన్నది సమాచారం. నిజానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషనల్స్ నుంచి రూ.48,000 కోట్ల డివిడెండ్లను కేంద్ర బడ్జెట్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయితే ఈ మొత్తం లక్ష్యాన్ని మించి వనగూడాయి. ఒక్క ఆర్‌బీఐ రూ.87,416 కోట్ల డివిడెండ్‌ను అందించింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి ఇదే సానుకూల అంకెలు వచ్చాయి. దీనితో 2023-24 కన్నా 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారీ డివిడెండ్లు వెలువడుతాయన్న అంచనాలు ఉన్నాయి. 2023-24లో ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం- ద్రవ్యలోటు జీడీపీలో 5.9 శాతంగా బడ్జెట్ అంచనా. 2025-26లో దీనిని 4.5 శాతానికి తగ్గించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం 5.4 శాతంగా ద్రవ్యలోటు ఉండాలన్నది ప్రభుత్వ రోడ్‌మ్యాప్స్‌లో భాగంగా ఉంది.




### 'గరీబీ హఠావో' నినాదం వింటూనే ఉన్నాం..

## బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగం

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. నూతన భవనంలో ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగిస్తున్నారు. కొత్త పార్లమెంట్‌లో ఇదే తన తొలి ప్రసంగం అని తెలిపారు. భారత సంస్కృతి, సభ్యత ఎంతో చైతన్యవంతమైనవని కొనియాడారు.

**రాష్ట్రపతి ప్రసంగంలోని ముఖ్యాంశాలివే..**

శాంతినికేతన్ ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది. భగవాన్ బిర్సా ముండా జన్మదినాన్ని జన్ జాతీయ దివస్‌గా జరుపుకొంటున్నాం. తెలంగాణలో సమ్మక్క-సారక్క గిరిజన వర్సిటీ ఏర్పాటు కానుంది. ఆదివాసీ యోధులను స్మరించుకోవడం గర్వకారణం. గతేడాది మన దేశం ఎన్నో ఘనతలు సాధించింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. ఆదిత్య ఎల్-1 మిషన్‌ను విజయవంతంగా ప్రయోగించింది. జీ20 సమావేశాలను విజయవంతంగా నిర్వహించుకున్నాం. ఆసియా క్రీడల్లో తొలిసారి భారత్ 107, పారా క్రీడల్లో 111 పతకాలు సాధించింది. తొలిసారిగా నమోభారత్ రైలును ఆవిష్కరించాం. చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేలా నారీశక్తి వందన్ అధినియమ్ బిల్లును ఆమోదించుకున్నాం. మన చిన్నతనం నుంచీ 'గరీబీ హఠావో' నినాదాన్ని వింటున్నాం. కానీ, జీవితంలో తొలిసారి పేదరికాన్ని పెద్ద ఎత్తున పారదోలడం చూస్తున్నాం. గత 10 ఏళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా భారత్ ముందుకెళ్తోంది. శతాబ్దాలుగా కలలు కంటున్న రామమందిర నిర్మాణం సాకారమైంది. ఎన్నో ఆటంకాలను అధిగమించి ఆలయాన్ని ప్రారంభించాం. దేశంలో 5జీ నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తోంది. కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చాం. 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' నినాదంతో ముందుకెళ్తున్నాం. రక్షణ, అంతరిక్ష రంగంలో కొత్త ఆవిష్కరణలు జరిగాయి. యూపీ, తమిళనాడులో రక్షణ కారిడార్‌లు ఏర్పాటయ్యాయి. ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాంకింగ్ వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచింది. 'మేక్ ఇన్ ఇండియా' మన నినాదం.



## ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మయాంక్ అగర్వాల్

టీమిండియా క్రికెటర్, కర్నాటక రంజీ టీమ్ కెప్టెన్ మయాంక్ అగర్వాల్ ఫ్లైట్‌లో నీళ్లు అనుకొని విషపూరిత లిక్విడ్ తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ప్రస్తుతం అగర్తలాలోని ఓ హాస్పిటల్ ఐసీయూలో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాడు. ఈ ఘటన దేశ క్రికెట్ వర్గాలను షాక్‌కు గురి చేసింది. అగర్తలాలో త్రిపుర, కర్నాటక మధ్య రంజీ మ్యాచ్ ముగిసిన తర్వాత మయాంక్ మంగళవారం టీమ్‌తో కలిసి ఢిల్లీ మీదుగా సూరత్‌కు బయలుదేరాడు. అగర్తలాలో ఇండిగో ఫ్లైట్ ఎక్కిన మయాంక్ తన సీటు ముందున్న ఓ పౌచ్‌ను చూశాడు. అందులో ఉన్నవి నీళ్లు అనుకొని కొంచెం తాగాడు. వెంటనే నోరు, గొంతులో తీవ్రమైన మంటతో ఇబ్బంది పడ్డాడు. రెండు సార్లు వాంతి కూడా చేసుకున్న అతను కనీసం మాట్లాడలేక పోయాడు. అప్పటికి ఫ్లైట్ ఇంకా బయల్దేరలేదు. దాంతో మయాంక్‌ను ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా అగర్తలాలోని ఐఎల్ఎస్ హాస్పిటల్ ఐసీయూలో చేర్చడంతో ప్రమాదం తప్పింది. నోటిలో మంట, పెదవులపై వాపుతో మయాంక్ ఇబ్బంది పడ్డాడని ఐఎల్ఎస్ హాస్పిటల్ హెల్త్ బులిటెన్‌లో తెలిపింది. అతనిప్పడు బాగానే ఉన్నాడని వెల్లడించింది. క్రికెటర్‌కు అందుబాటులో ఉన్న అత్యుత్తమ చికిత్స అందిస్తున్నామని త్రిపుర హెల్త్ సెక్రటరీ తెలిపారు. బుధవారం అతను బెంగళూరు వెళ్తాడని చెప్పారు.




## ప్రపంచ ఎకానమీపై ఐఎంఎఫ్ కీలక ప్రకటన

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి 2024 అవుట్‌లుక్‌ను అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) అప్‌గ్రేడ్ చేసింది. ఒడిదుడుకులను ఎదుర్కొంటూ అమెరికా వృద్ధి పయనం, ద్రవ్యోల్బణం నెమ్మదించడం దీనికి ప్రధాన కారణాలుగా పేర్కొంది. తాజా అవుట్‌లుక్‌లో 2024 వృద్ధి రేటును ఇంతక్రితం 2.9 శాతం అంచనాల నుంచి 3.1 శాతానికి పెంచింది. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే.. ద్రవ్యోల్బణం అవుట్‌లుక్‌ను తగ్గించింది. 2023లో 6.8 శాతం ద్రవ్యోల్బణం ఉంటే, 2024లో ఇది 5.8 శాతానికి, 2025లో 4.4 శాతానికి తగ్గుతుందని అంచనావేసింది. అగ్రదేశాల్లో ద్రవ్యోల్బణం 2024లో 2.6 శాతం ఉంటే 2024లో 2 శాతానికి తగ్గుతుందని పేర్కొంది. ఇక ప్రపంచ వాణిజ్య వృద్ధి రేటు 2024లో 3.3 శాతంగా ఉంటే, 2025లో 3.6 శాతానికి పెరుగుతుందని తెలిపింది. చరిత్రాత్మాక వాణిజ్య వృద్ధి సగటు 4.9 శాతంగా ఉంది.

## ఏపీలో భారీ పెట్టుబడులకు ఆమోదం

సీఎం జగన్ అధ్యక్షతన మంగళవారం స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశమైంది. ఈ సమావేశంలో పలు ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఇందన రంగంలో రూ.22,302 కోట్ల పెట్టుబడులు 5,300 మందికి ఉద్యోగాలు దక్కున్నాయి. రూ.12,065 కోట్ల పెట్టుబడితో 3350 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్ లను జేఎస్ డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలో విస్తారంగా పెట్టుబడులే లక్ష్యంగా ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది.



## సమావేశాలను అడ్డుకునేవాళ్లను ఎవరూ గుర్తుపెట్టుకోరు: ప్రధాని మోదీ

పార్లమెంట్ సమావేశాలను అడ్డుకునేవారిని ఎవరూ గుర్తుపెట్టుకోరు అని ప్రధాని మోదీ అన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆయన ఇవాళ మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తున్న ఎంపీలు తమను తాము ఆత్మపరిశీలన చేసుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. ఈసారి జరిగే బడ్జెట్ సమావేశాల వల్ల లాభం చేకూరుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో పాజిటివ్ సమాచారాన్ని ఇచ్చిన ఎంపీలను ఎప్పటికీ అందరూ గుర్తు ఉంచుకుంటారన్నారు. సభా సమావేశాలను అడ్డుకునేవాళ్లను ఎవరూ గుర్తుంచుకోరన్నారు. బడ్జెట్ సమావేశాల్లో పాజిటివ్ అంశాలను ప్రస్తావించేవారిని ప్రజలు గుర్తుంచుకుంటారన్నారు. ఫిబ్రవరి 9వ తేదీన బడ్జెట్ సమావేశాలు ముగియనున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి ఒకటో తేదీన బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

### ఉద్యోగులకు షాక్ ఇచ్చిన పేపాల్..

## ప్రపంచవ్యాప్తంగా 2,500 మందిపై వేటు




ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో లేఆఫ్స్ పర్వం కొనసాగుతోంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ట్విట్టర్, లింక్డిన్, మెటా వంటి టెక్ దిగ్గజాలు ఒకదాని తర్వాత ఒకటి సంస్థలోని ఉద్యోగులను ఇప్పటికే తొలగించాయి. పలు కంపెనీలు ఇంకా లేఆఫ్స్ కొనసాగిస్తున్నాయి. ఆయా సంస్థలు గత ఏడాది కాలంగా విడతల వారీగా ఉద్యోగులను ఇంటికి పంపుతున్నాయి. తాజాగా మరో దిగ్గజ సంస్థ లేఆఫ్స్ ప్రకటించి ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఫైనాన్షియల్ టెక్నాలజీ దిగ్గజం పేపాల్ ప్రపంచ వ్యాప్తంగా 9 శాతం ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. కంపెనీ నిర్ణయంతో సుమారు 2,500 మంది ఉద్యోగాలు కోల్పోనున్నారు. ఈ మేరకు ఉద్యోగులకు కంపెనీ సీఈవో అలెక్స్ క్రిస్ లేఖ రాశారు. ఉద్యోగాలు కోల్పోతున్న వారికి ఈ వారాంతంలో సమాచారం అందజేస్తామని లేఖలో వెల్లడించారు. కంపెనీలో డూప్లికేషన్ తగ్గించడం, వనరులను సమర్థంగా వినియోగించడం, ఆటోమేషన్ వినియోగంతో సంక్లిష్టతలు తొలగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అభివృద్ధికి అవకాశం ఉన్న విభాగాల్లో తమ పెట్టుబడులు కొనసాగిస్తామని ఈ సందర్భంగా క్రిస్ పేర్కొన్నారు.

## హైదరాబాద్ లో భేటీ కానున్న చంద్రబాబు-పవన్



నేడు లేదా రేపు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ హైదరాబాద్ లో భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీలో అభ్యర్థుల ఎంపిక, సీట్ల సర్దుబాటుపై కసరత్తు చేయనున్నట్లు సమాచారం. ఫిబ్రవరి మొదటి వారంలో ఉమ్మడిగా అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. త్వరలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి మేనిఫెస్టో విడుదల చేయనున్నట్లు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే నెల 4వరకు 'రా..కదలి రా' సభలకు విరామం ప్రకటించారు.



## కుమారి ఆంటీ షాప్ మూసివేత.. సాయానికి సందీప్ కిషన్

సోషల్ మీడియాలో ఎవరు ఎందుకు ఫేమస్ అవుతారో చెప్పలేం. అలా ఈ మధ్య హైదరాబాద్‌లోని రోడ్ సైడ్ ఫుడ్ స్టాల్ పెట్టుకుని బిజినెస్ చేసుకునే కుమారి అనే మహిళ చాలా ఫేమస్ అయిపోయింది. రీల్స్, యూట్యూబ్ వీడియోల్లో ఎక్కడ చూసినా ఆమెనే కనిపించింది. గత కొన్నేళ్లు నుంచి ఈమె షాప్ నడిపిస్తూ జీవనం సాగిస్తోంది. తాజాగా పోలీసులు మాత్రం ఈమె వ్యాపారాన్ని మూయించారు. 'బాబు మొత్తం మీ బిల్లు వెయ్యి అయింది.. రెండు లివర్లు ఎక్స్‌ట్రా' అనే ఒక్క లైన్‌తో ఫేమస్ అయిన కుమారి ఆంటీ దగ్గరకు జనాలు గట్టిగా వచ్చారు. ఈ క్రమంలోనే ఆమె వీడియోలు, ఇంటర్వ్యూలు తెగ వైరల్ అయ్యాయి. ఈ మధ్య తన కొత్త సినిమా 'ఊరు పేరు భైరవకోన' ప్రమోషన్లలో భాగంగా హీరో సందీప్ కిషన్, హీరోయిన్ వర్ష బొల్లమ్మ కూడా వచ్చిన భోజనం చేశారు. తాజాగా ట్రాఫిక్ సమస్య అవుతుందని చెప్పి హైదరాబాద్ పోలీసులు.. కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్ మూయించారు. ఈ క్రమంలోనే హీరో సందీప్ కిషన్ ఆమెకు అండగా ట్వీట్ చేశాడు. 'ఈమె ఎంతో మందికి స్ఫూర్తి.. తన కాళ్ల మీద తాను నిలబడి వ్యాపారం చేసుకుంటోంది.. ఆమెను ఇలా ఎందుకు చేస్తున్నారు.. ఆమెతో నా టీం టచ్‌లో ఉంటుంది. వీలైన సాయం చేస్తాను' అని ట్విట్టర్‌లో రాసుకొచ్చాడు. ప్రస్తుతం ఇది కాస్త ఇప్పుడు వైరల్‌గా మారింది.




## సెలూన్ యజమాని లైంగిక దాడి.. శానిటైజర్ తాగి యువతి ఆత్మహత్య

మీర్‌పేట్ టీచర్స్ కాలనీలోని గత కొంతకాలంగా సెలూన్‌లో పనిచేస్తున్న దివ్య అనే యువతి (18)పై యజమాని మురళి(35) లైంగిక దాడికి పాల్పడుతుండటంతో ఆమె శానిటైజర్ తాగి ఆత్మహత్య చేసుకుంది వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో ఈ ఘటన చోటు చేసుకుంది. గత కొంత కాలంగా ఓ సెలూన్ లో పని చేస్తున్న దివ్యను యజమాని మురళి లైంగిక దాడికి పాల్పడుతున్నట్లు సమాచారం. మంగళవారం 2024 జనవరి 30న మరళి సెలూన్ లో ఉన్న ఓ గదిలోకి దివ్య(18)ను తీసుకెళ్లి లైంగిక దాడి చేయడానికి ప్రయత్నం చేయగా.. దివ్య బయటికి వచ్చి అరవడంతో మురళి అక్కడి నుంచి పరారైయ్యాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన దివ్య సెలూన్ లో ఉన్న శానిటైజర్ తాగి ఆత్మహత్య చేసుకుంది. గతంలో పలుమార్లు మురళి దివ్యను లైంగిక దాడి చేశాడని సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## సీఆర్పీఎఫ్ జవాన్లపై రాకెట్ లాంచర్లతో మావోయిస్టుల దాడి

ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం మంగళవారం తుపాకుల మోతతో దద్దరిల్లిన సంగతి తెలిసిందే. మావోయిస్టుల మెరుపుదాడిలో ముగ్గురు జవాన్లు అమరులయ్యారు. అయితే మావోయిస్టులు రాకెట్ ఆకారపు బారెల్స్‌తో జవాన్లపై దాడి చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. అయితే బారెల్ గ్రెనేడ్ లాంచర్లను మావోయిస్టులు 2021లో అభివృద్ధి చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. స్వదేశీ టెక్నాలజీతో రూపొందించబడిన ఈ లాంచర్లను డజనుకు పైగా నిన్నటి దాడిలో ఉపయోగించినట్లు తెలిపారు. ఈ రాకెట్లతో దాడి చేయడం కారణంగా దాదాపు ఆరుగురు జవాన్లు తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. మావోయిస్టుల దాడిలో మొత్తం 15 మంది జవాన్లు గాయపడ్డారు. వారిని హెలికాప్టర్ ద్వారా రాయ్‌పూర్‌కు తరలించినట్టు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం తెలిపారు.



## మాల్దీవుల ప్రాసిక్యూటర్ జనరల్‌పై కత్తితో దాడి

మాల్దీవుల్లో దారుణ ఘటన జరిగింది. ఆ దేశ ప్రాసిక్యూటర్ జనరల్ హుస్సేన్ షమీమ్‌పై హత్యాయత్నం జరిగింది. కత్తితో అతన్ని కిరాతంగా పొడిచారు. మాజీ దేశాధ్యక్షుడు ఇబ్రహీం మహమ్మద్ సోలి నేతృత్వంలోని ఎండీపీ పార్టీ హుస్సేన్‌ను నియమించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మాల్దీవుల్లో రాజకీయ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుత అధ్యక్షుడు మహమ్మద్ ముయిజూ చైనాకు అనుకూలంగా ఉన్నారు. దీంతో విపక్ష ఎండీపీ పార్టీ ఆయన్ను వ్యతిరేకిస్తున్నది. ముయిజూపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని ఆ పార్టీలో యోచిస్తున్నది.

### ఫిబ్రవరి 10 నుంచి నిరవధిక నిరాహారదీక్షకు సిద్ధమవుతున్న

# మరాఠా రిజర్వేషన్ ఉద్యమకారుడు



మరాఠా రిజర్వేషన్ ఉద్యమకారుడు మనోజ్ జరంగే-పాటిల్ మరోసారి సంచలన ప్రకటన చేశారు. ఫిబ్రవరి 10 నుండి జాల్నాలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ అంశంపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ విరుద్ధమైన ప్రకటనలు చేశారని విమర్శించారు. మరాఠాలందరికీ కుంబీ సర్టిఫికెట్లు జారీ చేయాలని జరంగే-పాటిల్ డిమాండ్ చేస్తున్నారు.కుంబీ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడంలో ప్రభుత్వం జాప్యం చేస్తే ఫిబ్రవరి 10 నుంచి మళ్లీ ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని మనోజ్ జరంగే పాటిల్ తెలిపారు. మరాఠా వర్గానికి పూర్తిగా కుంబీ కుల ధృవీకరణ పత్రం ఇవ్వడం ప్రారంభించకపోతే, ఓబీసీ వర్గానికి ఇచ్చిన 27 శాతం రిజర్వేషన్‌ను కోర్టులో సవాలు చేస్తామని జరంగే పాటిల్ అన్నారు. అయితే జరంగే పాటిల్ తీరును జాతీయ ఓబీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు తయావాడే తప్పుబట్టారు. రద్దు చేయలేని మండల్ కమిషన్ ద్వారా ఓబీసీ రిజర్వేషన్లు సాధించామని తయావాడే తెలిపారు. మనోజ్ జరంగేకు న్యాయ పరిజ్ఞానం లేదని, అందుకే ఇలా మాట్లాడుతున్నారని, దీని వల్ల ఓబీసీ వర్గాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. రాయ్‌గఢ్ పర్యటనలో ఉన్న మరాఠా నాయకుడు మనోజ్ జరంగే పాటిల్ మహారాష్ట్ర సర్కార్ తీరుపై మండిపడ్డారు. మరాఠా వర్గానికి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కావడం లేదన్నారు. మరాఠా కమ్యూనిటీ ప్రజలకు కుంబీ కుల ధృవీకరణ పత్రం ఇచ్చే ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదన్నారు. ప్రభుత్వం తన హామీని నెరవేర్చకపోతే ఫిబ్రవరి 10వ తేదీ నుంచి మళ్లీ ఆమరణ నిరాహార దీక్ష చేపడతామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ పాత్ర పోషిస్తోందని మనోజ్ జరంగే ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశంపై ముఖ్యమంత్రి సంతకం ఉందని చెప్పారు. ఈ ఆదేశంపై అభ్యంతరాలు ఉన్నా, ప్రభుత్వం 15 రోజుల్లోగా ఈ ఆదేశాన్ని చట్టంగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు.అయితే మరాఠా రిజర్వేషన్లకు సంబంధించిన ఆర్డినెన్స్ విషయంలో రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కాయి. మనోజ్ జరంగే పాటిల్ వ్యాఖ్యలపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మండిపడ్డారు. ఓబీసీ వర్గాలకు అన్యాయం జరగడానికి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమన్నారు. అవసరమైతే బీజేపీ అగ్రనేతలతో ఈ అంశంపై చర్చిస్తామన్నారు. ముఖ్యమంత్రి సంతకం చేసిన మరాఠా కమ్యూనిటీ రిజర్వేషన్ ముసాయిదాపై మంత్రివర్గంలో చర్చించలేదని మంత్రి ఛగన్ భుజ్‌బల్ స్పష్టంగా చెప్పారు. మంత్రివర్గాన్ని విశ్వాసంలోకి తీసుకోకుండానే ముఖ్యమంత్రి ఈ ముసాయిదాపై సంతకం చేశారు. ఓబీసీ పక్షం నుంచి ఎలాంటి వ్యతిరేకత ఉండదని ముఖ్యమంత్రి అర్థం చేసుకున్నారని, ఓబీసీ వర్గాన్ని తన కాళ్ల కింద తొక్కేయడమే కాకుండా ఓబీసీ కోటా నుంచి మరాఠా సామాజికవర్గానికి రిజర్వేషన్లు కల్పించేందుకు ముసాయిదా రూపొందించారని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత విజయ్ వాడెట్టివార్ అన్నారు. దీన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాన్‌కులే మాట్లాడుతూ ఓబీసీ వర్గానికి ఎలాంటి చిన్న నష్టం జరగనివ్వబోమన్నారు. ఈ విషయం చర్చల ద్వారా పరిష్కరించుకుంటామన్నారు. రిజర్వేషన్ల కోసమే కుంబీ కుల ధృవీకరణ పత్రాన్ని మరాఠాలు ఎవరూ తీసుకోరని కేంద్ర మంత్రి నారాయణ్ రాణే కుమారుడు, మాజీ ఎంపీ నీలేష్ రాణే అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సరికాదని, దీనిపై తమ నిరసనలు తెలుపుతామన్నారు. జనవరి 20న, OBCలకు కేటాయించిన కోటా కింద ప్రయోజనాలు పొందేందుకు మరాఠాలందరికీ కుంబీ సర్టిఫికెట్లు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ జరంగే-పాటిల్ అంతర్వాలి సారథి నుండి నావీ ముంబైలోని వాషికి వరకు పాదయాత్ర నిర్వహించారు. ఆ మరుసటి రోజు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే జనవరి 27న అతనిని కలుసుకుని, తన డిమాండ్‌ను లిఖితపూర్వకంగా నెరవేరుస్తానని వాగ్దానం చేస్తూ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ కాపీని అతనికి అందజేశారు. ఆ వెంటనే తన మార్చ్‌ను ముగించాడు. ఫిబ్రవరి 16 వరకు నోటిఫికేషన్‌పై సూచనలు, అభ్యంతరాలను ప్రభుత్వం ఆహ్వానించింది. ఆ తర్వాత ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లను ఆమోదించాలని భావిస్తోంది మహారాష్ట్ర సర్కార్.

## శర్వాకు జోడీగా ఇద్దరు భామలు?

'సామజవరగమన' సినిమాతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు దర్శకుడు రామ్ అబ్బరాజు. ఇప్పుడాయన తదుపరి చిత్రాన్ని హీరో శర్వానంద్‌తో తీసేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ సినిమాలో శర్వాకు జోడీగా ఇద్దరు నాయికలు కనిపించనున్నారని తెలిసింది. దీన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించనుంది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న చిత్రం కోసం సంయుక్తా మేనన్‌తో పాటు సాక్షి వైద్య పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం.





## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మళ్లీ నోటీసులు

అనర్హత పిటిషన్ల వ్యవహారంలో.. వైఎస్సార్‌సీపీ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం మరోసారి నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యేల అభ్యర్థన మేరకు ఫిబ్రవరి 8వ తేదీన స్వయంగా విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారాయన. ఈసారి వాళ్ల నుంచి పూర్తిస్థాయి వివరణ తీసుకున్నాకే నిర్ణయం ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఏపీ స్పీకర్ కార్యాలయం నుంచి ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు వెళ్లాయి. ఫిబ్రవరి 5వ తేదీలోగా ఈ నోటీసులకు స్పందించాలని స్పీకర్ కార్యాలయం కోరింది. వైఎస్సార్‌సీపీ నుంచి ఫిరాయించిన నలుగురు ఎమ్మెల్యేలతో పాటు పిటిషనర్ అయిన ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద రాజులకు నోటీసులు పంపించారు. ఈ ఐదుగురిని ఒకేసారి కలిపి విచారణ చేయనున్నారు స్పీకర్ తమ్మినేని. మరోసారి ఎమ్మెల్యేల వివరణ తీసుకోనున్న తర్వాతే ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ విషయంలో ఓ స్పష్టమైన నిర్ణయం ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిరాయింపుదారులపై అనర్హత వేటు వేయాలంటూ అసెంబ్లీలో చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, మండలిలో చీఫ్‌విప్ మేరిగ మురళీధర్ ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని అసెంబ్లీ స్పీకర్ వారిని కోరిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నుంచి పార్టీ ఫిరాయించిన మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేలు అనర్హత పిటిషన్‌పై సోమవారం స్పీకర్ తమ్మినేని విచారణ జరిపారు. అయితే ఇందులో స్పీకర్ ఎదుట వ్యక్తిగత విచారణకు ఐదుగురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ క్రమంలో వివరణ ఇవ్వడానికి తమకు నాలుగు వారాల సమయం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే మూడుసార్లు టైం ఇచ్చిన సంగతి గుర్తు చేశారు కూడా. మరోవైపు అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవీలతో పాటు ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్యలకు హైకోర్టులో చుక్కెదురైంది. విచారణకు సంబంధించిన తదుపరి చర్యలన్నీ నిలుపుదల చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. నోటీసులకు వివరణ ఇచ్చేందుకు తమకు నాలుగు వారాల గడువునిచ్చేలా ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలన్న వారు చేసిన అభ్యర్థనను సైతం హైకోర్టు తోసిపుచ్చింది. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సాధ్యంకాదని తేల్చిచెప్పింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 26కి వాయిదా వేసింది.

## చంచల్‌గూడ జైలు నుంచి బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయానికి శివబాలకృష్ణ



ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు అయి ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణను ఏసీబీ కస్టడీకి కోర్టు అనుమతించింది. ఎనిమిది రోజుల పాటు శివ బాలకృష్ణ ఏసీబీ కస్టడీలో ఉండనున్నారు. ఈ మేరకు బుధవారం శివ బాలకృష్ణను అధికారులు చంచల్‌గూడ జైలు నుంచి బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఈ విచారణలో మరిన్ని విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. కాగా, రెరా కార్యదర్శి శివ శివబాలకృష్ణపై సస్పెన్షన్ వేటు పడిన సంగతి తెలిసిందే. శివబాలకృష్ సస్పెన్షన్‌పై హెచ్ఎండీఏ మెట్రో పాలిటన్ కమిషనర్ దాన కిశోర్ మంగళవారం రాత్రి ఉత్వర్వులు జారీ చేశారు. గతంలో మెట్రో రైల్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా పని చేశారు శివ బాలకృష్ణ. రెరా ఇంచార్జి కార్యదర్శిగా కూడా పని చేశారు.